



# అరగంట ముందే గేట్లు క్లోజ్

### రేపటి నుంచే జేఈఈ మెయిన్స్ పరీక్షలు

### ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు

ఏలూరు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీల్లో అడ్మిషన్లకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ తొలి సెషన్ ఆన్‌లైన్(సీబీటీ) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు సెంటర్లలోని పలు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. భీమవరం డీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు శివారు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, దుగ్గిరాల పరిధిలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో ఆయా రోజుల్లో నిర్వహిస్తారు. రోజుకు రెండు పూటలా జరిగే ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతాయి. ఆయా కేంద్రాల వారీగా కేటాయించిన తుది పరీక్షార్థుల సంఖ్య మంగళవారం ఖరారవుతుంది. 22 నుంచి 29 వరకు పేపర్-1 (బీఈ/బీటెక్) పరీక్షలు, 30న పేపర్-2 (బీఆర్క్, బీప్లానింగ్) పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలకు ఎన్టీయే ఆధ్వర్యంలో టీసీఎస్ సంస్థ నిర్వహిస్తుంది.

**అర గంట ముందే 'గేట్ క్లోజ్'**

ఈ దఫా జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కీలకమైన 'గేట్ క్లోజ్ టైం' నిబంధనను పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీయే) అమల్లోకి తెచ్చింది. ఆ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి అర గంట ముందే పరీక్ష కేంద్రం మెయిన్‌గేట్‌ను మూసివేస్తారు. ఉదయం పరీక్ష 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్ష 2.30 గంటలకు ముందుగానే విద్యార్థులు లోపలికి వెళ్లిపోవాలని, ఆ తర్వాత ఖచ్చితంగా ప్రధాన ప్రవేశ ద్వారాన్ని మూసివేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. దీనికనుగుణంగానే కేంద్రాల గేట్లను పరీక్ష ప్రారంభ సమయానికి రెండు గంటల ముందుగానే ఓపెన్ చేసి విద్యార్థులను లోపలికి అనుమతిస్తామని, పరీక్షార్థులంతా ఈ నిబంధనను దృష్టిలో పెట్టుకుని తమకు కేటాయించిన కేంద్రానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు.

'గేట్ క్లోజ్ టైం' తర్వాత వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షార్థులందరూ తమ అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, దర ఖాస్తు చేసినపుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటో గుర్తింపు కార్డు ఒరిజినల్ కాపీ, ఒక పెన్‌లను తప్పని సరిగా తీసుకురావాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువు లేవీ విద్యార్థులు తీసుకురావద్దని సూచించారు.

# తేరుకోకుంటే తిప్పలే..

- నాలుగు లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు
- 40 టీఎంసీల నీరు అవసరం..
- ఫిబ్రవరి నుంచి వంతులవారీ విధానం అమలు
- పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటి విడుదల

ఆకివీడు రూరల్ జనవరి 20(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ముంపు నీటి నుంచి పంటలను రక్షించుకోవడానికి కష్టాలు పడిన రైతులు నేడు సాగు నీటి కోసం అగచాట్లు పడుతున్నారు. మొన్న అతి వృష్టి నేడు అనావృష్టి. దయనీయ పరిస్థితుల్లో రైతులు వ్యవసాయంతో కొట్టుమిట్టాడుతున్నారు. జనవరిలోనే దాళ్వా వరి నారుమడులకు, నాట్లు వేయడానికి, యదజల్లిన పొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. తూడు, గుర్రపుడెక్క కాలువల్లో పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. దీంతో ప్రధాన కాలువ నుంచి వెళ్లే పంట బోదెలు నీరు లేక ఎండిపోతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం, నీటి సంఘాల బాధ్యతా రాహిత్యం వెరసి సాగు నీటికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. జనవరిలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే రానున్న రోజులలో ఇంకెలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పశ్చిమ డెల్టా నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నది. రానున్న రోజుల్లో విజ్జేశ్వరం వద్ద నీటి లభ్యతను బట్టి నీటిని దిగువకు విడుదల చేస్తారు. ఫిబ్రవరి నుంచి వంతుల వారీ విధానానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నీటి సంఘాలు, అధికారులు మురుగు కాలువలపై అడ్డుకట్టలు వేసి నీటి ఎద్దడి రానివ్వకుండా చూడాలి. పంట కాలువలు, మురుగు కాలువలలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడును తొలగించి నీటి ఎద్దడి రానివ్వకుండా చూడాలి. ఇప్పటికే ఎదుర్కొంటున్న ఇబ్బందులతో వ్యవసాయమంటే పండుగ నుంచి దండగ అనే విధంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా వరకు రైతులు ఆక్వా సాగు వైపు మరలి పోయారు. పశ్చిమ డెల్టాలో 5,29,962 ఎకరాలు విస్తీర్ణానికి సాగు నీరు అందిస్తుండగా, దాళ్వాకు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నది. దాళ్వా సాగు పంట పూర్తయ్యే సరికి 40 టీఎంసీలు కావాలి. మొన్నటి వరకు 6,500 క్యూసెక్కుల నీరు విడదల చేయగా, ప్రస్తుతం ఐదు వేల క్యూసెక్కులకు తగ్గింది. వంతుల వారీ విధానం వచ్చే సరికి నాలుగు వేల క్యూసెక్కులు మాత్రమే వచ్చే అవకాశం వుంది. నీటి సంఘాలు, అధికారులు సమన్వయంతో స్థానిక సమస్యలు పరిష్కరించి రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో చాలా కాల్వలకు మోక్షం కలిగింది. ప్రభుత్వం కూడా అదే స్థాయిలో కాల్వల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. ఉండి నియోజక వర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణ రాజు కాలువలపై ప్రధానంగా దృష్టి సారించి సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ అధికారులు ఆయన సంకల్పాన్ని అందుకోలేకపోతున్నారు. ఆకివీడు మండలం పాతవయ్యేరు కాలువలోని గుర్రపు డెక్క, తూడు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళితే సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆయన దృష్టికి వెళ్లాకే సమస్య పరిష్కారం మొదలైందని చెబుతున్నారు.



పాతవయ్యేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు



ఆచంట పోలీసు స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎస్పీ నయీం అస్మి, ఎమ్మెల్యేలు పితాని, ఆరిమిల్లి, అంజిబాబు, ఎమ్మెల్సీలు రవీంద్ర, ఐవీ తదితరులు

# నేరాల అదుపునకు చర్యలు : ఎస్పీ నయీం

- ఆచంట పోలీసు స్టేషన్ ప్రారంభం

ఆచంట, జనవరి 20(ఆంధ్రజ్యోతి):జిల్లాలో నేరాల అదుపునకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. ఆచంటలో అన్ని మౌలిక వసతులతో మోడల్ పోలీసుస్టేషన్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రూ.కోటి 40 లక్షలతో ఈ స్టేషన్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. 2018లో తాను మంత్రిగా ఉన్నపుడు దీనికి శంకుస్థాపన చేశానని, ఇప్పుడు అన్ని హంగులతో ప్రారంభించినట్లు తెలిపారు. ఆచంటలో క్రైం రేటు తగ్గేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో పెనుమంట్రలో కొత్త పోలీసు స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలి చైర్మన్ మోషేన్‌రాజు, తణుకు భీమవరం ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి అంజిబాబు, ఎమ్మెల్సీలు కౌరు శ్రీనివాసు, బొర్రా గోపీమూర్తి, వంక రవీంద్ర, ఇళ్ల వెంకటేశ్వరరావు, ఏఎస్పీలు వి.భీమారావు, మురళీకృష్ణ, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సర్పంచ్ కోట సరోజిని, జెడ్‌పీటీసీ ఉప్పలపాటి సురేస్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మరో 12,500 టన్నులు

### మిగులు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ నిర్ణయం

### ఇప్పటి వరకు 4.13 లక్షల టన్నుల సేకరణ

### రైతుల ఖాతాల్లో రూ.948 కోట్లు జమ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రైతుల వద్ద మిగిలిన పోయిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు మరో 12,500 టన్నుల ధాన్యాన్ని అదనంగా సేకరించేలా ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు కొనుగోళ్లు ప్రారంభించింది. ఈ ఏడాది అంచనాలకంటే అధికంగా ధాన్యం దిగుబడులు వచ్చాయి. తాడేపల్లిగూడెం తదితర మండలాల రైతులు ప్రైవేటు వర్తకులకు విక్రయించారు. లేదంటే ప్రభుత్వం మరింత లక్ష్యాన్ని పెంచాల్సి వచ్చేది. తొలుత జిల్లాలో 4.10 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. నిబంధనల్లో వెసులుబాటు కల్పించిన ఫలితంగా ప్రభుత్వానికి ధాన్యం అమ్మడానికే రైతులు ఆసక్తి చూపారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లోకి సొమ్ములు జమయ్యాయి. మూడు వారాల క్రితమే జిల్లాలో లక్ష్యం పూర్తయ్యింది. అయినా వీరవాసరం, ఆచంట, యలమంచిలి తదితర మండలాల్లో ధాన్యం మిగిలింది.



దీనిపై పౌరసరఫరాల కార్పొరేషన్‌కు జాయింట్ కలెక్టర్ లేఖ రాశారు. జిల్లాకు అదనంగా 16 వేల టన్నుల లక్ష్యాన్ని ఇవ్వాలని కోరారు. మరోవైపు కృష్ణా జిల్లా నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి జిల్లా మిల్లర్లకు అప్పగించింది. ఇది కూడా జిల్లాపై భారం పడింది. అదనపు లక్ష్యం కోసం అధికారులు ఎదురుచూస్తూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం 12,500 టన్నుల కొనుగోలుకు అవకాశం కల్పించింది. జిల్లాలో ఇప్పటి వరకు 64,858 మంది రైతుల నుంచి 4,13,548 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనికి గాను రూ.951 కోట్లకు రూ.948 కోట్లు చెల్లించారు. బకాయి మరో రూ.3 కోట్లు మాత్రమే ఉంది. ఇంకా 8,500 టన్నుల ధాన్యం సేకరించాలి. మరో నాలుగు రోజులు వ్యవధిలోనే కొనుగోలు చేసి, రైతులకు సొమ్ములు జమ చేయనున్నారు.

# వేములదీవి స్థలంపై ప్రభుత్వానికి నివేదిక

నరసాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఆ ఐదెకరాల స్థలం ఎక్కడ ?' అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ నరసాపురం పురపాలక సంఘాన్ని వివరణ కోరింది. టౌన్ ప్లానింగ్ అధికారి త్రినాథ్ స్థలాన్ని పరిశీలించి స్థలం కొనుగోలు, కేటాయింపు, కౌన్సిల్ తీర్మానం తదితర వివరాలను కమిషనర్ అంజయ్యకు వివరించారు. దాని ప్రకారం ఆర్వోసీ నెంబర్ ఈ 4/6445/2013, 4-1-2014న కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వేములదీవి తూర్పులో 826/2 స్థలాన్ని డంపింగ్ యార్డు నిమిత్తం కొనుగోలు చేశారు. ఎకరానికి రూ.5.25 లక్షలు చెల్లించాలని అప్పటి ఉమ్మడి పశ్చిమ కలెక్టర్ సిద్దార్థజైన్ ఆదేశాల ప్రకారం 12వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.26.25 లక్షలు 15-9-2014లో రెవెన్యూకు చెల్లించినట్లు తెలియజేశారు. సదరు భూమి ఖాళీగా ఉందని, త్వరలో దీనిని స్వాధీనం చేసుకోనున్నట్లు మునిసిపల్ ఆర్డీకి వివరణ ఇచ్చారు.

# ఆర్టీసీకి అద్దె బస్సులు కావలెను

- ఇప్పటికే వివిధ రూట్‌లలో 75 బస్సులు
- మరో 15కు టెండర్లు

భీమవరం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అద్దె బస్సుల ఏర్పాటుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ప్రధాన రూట్‌ల్లో ఈ అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్సులకు సరైన మెయింటినెన్స్ లేక చాలాచోట్ల ఆగి పోతున్నాయి. మరోవైపు ఇటీవల కాలంలో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు డిపోల్లో 15 బస్సులకు ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన తర్వాత కొత్త బస్సుల ప్రక్రియను పక్కన పెట్టింది. అద్దె బస్సుల వైపే మొగ్గు చూపింది. డిపోల వారీగా వివరాలను సేకరించి రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలిచారు.



జిల్లాలో 30 బస్సులకు టెండర్లు పిలిచారు. అప్పట్లో అద్దె బస్సులు తీసుకోవడంపై అభ్యం తరాలు వ్యక్తమైనా చివరకు టెండర్లు పిలిచారు. భీమవరం, తణుకు, నరసాపురం, తాడేపల్లిగూడెంలోని డిపోల్లో 229 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటికితోడు అద్దెకు తీసుకున్న బస్సులు 76 ఉన్నాయి. కొత్తగా పిలిచిన వాటితో కలిపితే దాదాపు 91కు పెరగనున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని డిపోల వారీగా పరిశీలిస్తే భీమవరంలో 15 బస్సులు, తాడేపల్లిగూడెం 23, తణుకు 24, నరసాపురంలో 16 అద్దె బస్సులు ఉన్నాయి. వీటికి అదనంగా పిలవనున్నారు.

**ప్రతిపాదనల రూట్లు**

భీమవరం-తాడేపల్లిగూడెం, భీమవరం-అమలాపురం, భీమవరం-ఏలూరు, తణుకు- భీమవరం, భీమవరం-తణుకు, తణుకు-రాజమహేంద్రవరం, తణుకు-హైదరాబాద్, తణుకు-రాజమండ్రి, భీమవరం-గుడివాడ, భీమవరం-నరసాపురం, నరసాపురం-భీమవరం సర్వీసులకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

# కురులు విప్పిన సిరులు

### ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో లక్షల సంఖ్యలో భక్తులు తలనీలాల సమర్పణ

### కేటగిరీని బట్టి ధరలు.. వేలం ద్వారా కోట్ల ఆదాయం

### విగ్గుల తయారీకి..ఇతర దేశాలకు ఎగుమతి -6లో





# చారిత్రక ఆనవాళ్లకు సమాధి

### పోలవరం ముంపులో రుద్రమ్మకోట

### మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు

### ఆది మానవులు నడిచినట్టు నిర్ధారణ

### ఆ రాతి నిర్మాణాలే.. సమాధులు

### త్వరలో ఈ ఊరు జల సమాధి

ఆ ఊరి పేరు రుద్రమ్మకోట. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని గోదావరి తీర గ్రామం. మూడు వేల సంవత్సరాల క్రితం ఆది మానవులు ఇక్కడ సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. చనిపోయిన వారికి సమాధులు ఉన్నాయి. వీటిని పురావస్తు శాఖ నిర్ధారించింది. ఈ చారిత్రక గ్రామం పోలవరం ప్రాజెక్టు రాకతో పూర్తిగా మునిగిపోనుంది. 6లో..

# సమస్యలపై సత్వర పరిష్కారం

- పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్-మీ కోసం)కు వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 194 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు అర్జీలు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

**నా కూతురు పొలం రాయించుకుని గెంటేసింది**

'నా వయసు 83 ఏళ్లు. ముగ్గురు కుమార్తెలు. వారి వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చాను. నా భార్య ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఒంటరిగా ఉంటున్నా. నాకు 2.26 ఎకరాల పొలం వుంది. ఒక కుమార్తె నన్ను చూస్తుందని కొంత పొలం రాశాను. ఆ తర్వాత నన్ను ఇంటిని నుంచి గెంటేసింది. చాలా ఇబ్బందులు పడుతున్నా. న్యాయం చేయండి' అంటూ వీరవాసరం మండలం దుసానపూడికి చెందిన సావరం రామయ్య కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.

**మిగిలిన పొలం ఎక్కడుంది ?**

మాకు ఎనిమిది ఎకరాల ఏడు సెంట్లు భూమి ఉండాలి. కాని, 91 సెంట్లు మాత్రమే ఉంది. మిగిలిన పొలం ఎక్కడ ? సర్వే చేయించి దస్తావేజుల ప్రకారం హద్దులు చూపండి' అంటూ భీమవరం మండలం యనమదుర్రుకు చెందిన గాదిరాజు వెంకటరాజు, నాగరాజు, సూర్యకాంతం కోరారు.

**కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధం**

జిల్లాలో దశల వారీ ప్లాస్టిక్ నిర్మూలనకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. క్యారీ బ్యాగులు, టీ గ్లాసులు నిషేధిస్తూ.. మలి విడత మరిన్ని ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు కృషి చెయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా తొలి అడుగు కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. సమావేశానికి వచ్చిన అధికారులకు స్టీలు పాత్రల్లో తాగు నీటిని, స్నాక్స్ తేనీటిని అందించేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి క్యారీ బ్యాగులు, టీ క్లాసులు వినియోగంపై ముమ్మరంగా తనిఖీలు చేపడతామని అన్నారు.



ఎస్సీ, ఎస్టీల కులగణనలో అభ్యంతరాలకు, సవరణలకు తేదీని పొడిగించాలని కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం : ఎస్పీ



భీమవరం క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మళ్లీ మళ్లీ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ- ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఆస్తి తగాదాలు, ఇతర పలు సమస్యలపై మొత్తం 11 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఈ కోళ్లకు ఏమైంది ?

### అంతుచిక్కని వైరస్.. గంటల వ్యవధిలో లక్షకుపైగా మృత్యువాత

### చనిపోయిన వాటిని రోడ్ల పక్కన పడేస్తున్న పెంపకందారులు

గత కొన్ని రోజులుగా అంతుచిక్కని వైరస్‌తో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గంటల వ్యవధిలో గిలాగిలా కొట్టుకుంటూ మృత్యువాత పడుతున్నాయి. వీటిని తింటే రోగాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే పెంపకందారులు వీటిని సంచుల్లో కుక్కి రోడ్ల పక్కన పాడేస్తున్న దృశ్యాలు.. పెంటపాడు పరిసర ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. 7లో..

## గాలికి వదిలేశారు!



గాలి గోపురంపై మొలిచిన మొక్కలు

పాలకొల్లు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రాల్లో ఒకటైన శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ గాలి గోపురంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంతో ప్రసిద్ధిచెందిన ఆలయ గాలిగోపురం నిర్వహణా లోపం కారణంగా మొక్కలు పెరిగిపోతున్నాయి. రావి మొక్కలు పెరిగిపోవడంతో గాలి గోపురానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఏర్లు పెరిగిపోతే బీటలు వారే అవకాశం ఉంది. ప్రతీ ఏటా పెరిగిన మొక్కలను తొలగించడం ఆనవాయితీ.. అయితే ఏడాది దాటినా మొక్కలను తొలగించకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రంగులు వెలసిపోవడంతో గోపురం కళ తప్పింది. కనీసం శివరాత్రి నాటికైనా మొక్కలు తొలగించి గోపురానికి రంగులు వేయించాలని భక్తులు ఆలయ అధికారులను కోరుతున్నారు.

## జాతి వైరం మరచి.. అమ్మయింది...!



కుక్క వద్ద పాలు తాగుతున్న పిల్లిపిల్ల

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతి వైరాన్ని మరచి ఓ శునకం పిల్లిపిల్లను తన పొత్తిళ్లలో చోటివ్వడం చూపరులను ఆశ్చర్యగొలుపుతోంది.. ద్వారకాతిరుమల శివారు వసంత్ నగర్ కాలనీలో ఓ ఇంటి వద్ద శునకం ఇలా పిల్లిపిల్లను కంటికి రెప్పలా సాకుతోంది. దానికి తనవద్ద పాలు కూడా పట్టించడంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. సహజ సిద్ధంగా ఈ రెండు జంతువులకు పరస్పర వైరం ఉంటుంది. పిల్లిని చూసిన వెంటనే శునకం దానిపై దాడికి ప్రయత్నిస్తుంది. అయితే ఇక్కడ దానిపై కూర్చోపెట్టుకోవడంతో పాటు ఏకంగా తనవద్ద పాలు పట్టించడాన్ని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## ఊరా కప్ అంపైరింగ్‌కు నాగేంద్ర సింగ్ ఎంపిక



ఎంపికైన నాగేంద్ర సింగ్

ఏలూరు రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఆల్ గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్‌కు అంపైర్ నాగేంద్రసింగ్‌ను ఎంపిక చేసినట్టు ఊరా కప్ సమన్వయకర్త యోగేష్ షిండే ఆదేశాలు జారీ చేశారు. గుజరాత్ ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులు ఈపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అదానీ, రిలయన్స్, టాటా పవర్, గుజరాత్ ఎలక్ట్రిసిటీ బోర్డు లాంటి దిగ్గజాలు హాజరుకానున్నాయి. ఈ నెల 24 నుంచి బరోడాలో ఈ టోర్నమెంట్ జరగనుందని అంపైర్ సింగ్ తెలిపారు.

## దార్శిక్‌కు ఎన్టీఆర్ స్టార్ కప్




స్టార్ కప్ అందుకుంటున్న దార్శిక్

పాలకొల్లు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన ఆరేళ్ళ బాలుడు ఈలప్రోలు దార్శిక్ ఎన్‌టిఆర్ స్టార్ అవార్డును అందుకున్నారు. విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా సీనియర్, జూనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో జూనియర్ అండర్ 8విభాగంలో రన్నర్‌గా దార్శిక్ నిలిచినట్టు కోచ్ కిరణ్ సోమవారం తెలిపారు. అవార్డును అందుకున్న దార్శిక్‌ను టౌన్ హాల్ అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి రాధాకృష్ణ, ముచ్చర్ల ఆదినారాయణ, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు కొటికలపూడి కృష్ణ బోళ్ళ సుభాష్ చంద్రబోస్, రావూరి రామ్మోహన్ తదితరులు అభినందించారు.

# కురులు విప్పిన.. సిరులు..

» ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో లక్షల సంఖ్యలో భక్తులు తలనీలాల సమర్పణ » కేటగిరిని బట్టి ధరలు.. వేలం ద్వారా కోట్ల ఆదాయం

దేవదేవుని ముందు అంతా సమానమే.. అందుకే చిన్నా, పెద్దా, పేద, ధనిక అనే భేదాలను విడనాడి స్వామిని సేవించి ఆధ్యాత్మిక చింతనలో మైమరచిపోతుంటారు స్వామి భక్తులు, దేవదేవుని నిండైన దీవెనలు అందుకుంటూ ఆత్మ శుద్ధి పొందుతుంటారు. దర్పం, హుందా తనంగా భావించే శిరులను దేవదేవునికి అర్పించి తనలోని భక్తిని చాటుకుంటూ పాపాల ముడిని స్వామికి సమర్పించి భారాన్ని దింపుకుంటారు. తప్పులు చేయకుండా కాచి కాపాడాలని, నిండు నూరేళ్ల పాటు సకల సంపదలు సమకూర్చాలని నిండు మనస్సుతో వేడుకుంటారు. ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే ఈ తల నీలాలు ఆలయాల అభివృద్ధికి సిరులు కురిపిస్తున్నాయి... విగ్గుల కోసం వినియోగించే ఈ శిరోజాలు కేజీ ధర వేలల్లో పలుకుతూ ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం మీ కోసం..

- ద్వారకాతిరుమల, (ఆంధ్రజ్యోతి)





చినవెంకన్నకు భక్తులు సమర్పించే కురులు సిరులు కురిపిస్తున్నాయి. తమ ఇష్టదైవానికి తలనీలాల సమర్పించడాన్ని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ముఖ్యంగా ఏడు కొండలవానికి తలనీలాలు సమర్పిస్తూ దేవదేవుని నిండైన దీవెనలు అందుకుంటున్నారు. ఇందు కోసమే ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలం ఘాట్ రోడ్డులో కోట్లాది రూపాయలు వెచ్చించి దేవస్థానం కల్యాణ కట్టను నిర్మించింది. ఇక్కడే దేవదేవుని తలనీలాల మొక్కును భక్తులు చెల్లించుకుంటారు. ఈ ప్రదేశాన్నే కల్యాణకట్ట అని పిలుస్తారు.. హిందూ సంప్రదాయం ప్రకారం శుక్ర, శనివారాల్లో క్షురకర్మ చేయించుకోవడం అపచారంగా భావిస్తారు.. అలాగే సూర్యోదయం తర్వాత మధ్యాహ్న సమయాల్లోనూ క్షురకర్మ చేయించుకోరు ఇది తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం. అయితే శ్రీనివాసుని సన్నిధి నిత్యకల్యాణం.. పచ్చతోరణం.. ఇక్కడ అలాంటి నియమాలు ఉండవు కాబట్టే ఇది కల్యాణకట్టగా ప్రసిద్ధి చెందింది.

### పాపాలను దూరం చేసే శ్రీవారు...

పేద, ధనిక అనే భేదం లేకుండా నిత్యం ఏడుకొండలపై తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కళకళలాడుతూ ఉంటుంది. భక్తుల నుంచి తలనీలాలు తీసుకుని వారి పాపాలు పోగొట్టే శ్రీనివాసుడు కలియుగ ప్రత్యక్ష దైవం గాను, ఆపదమొక్కులవాడిగాను ఖ్యాతి గాంచారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లే చినవెంకన్నను దర్శించుకునే యాత్రికులు నిత్యం వేలల్లో ఉంటారు. అందుకే విరాళాలు, టిక్కెట్ల రూపంలో ఆర్జించే ఆదాయంతో పాటు భక్తులు తలనీలాల రూపంలో ఆదాయం సమకూరుస్తూ ఉంటారు. వీటి ద్వారా శ్రీవారికి ఏటా కోట్లాది రూపాయల మేర ఆదాయం అందుతోంది..

### తలనీలాల వెనుక మర్మమేంటి?

హిందూ సంప్రదాయం ప్రకారం చిన్నా పెద్దా అనే భేదం లేకుండా తమ ఇలవేల్పునకు తలనీలాలు సమర్పించి దైవం ముందు వినమ్రతను చాటుకుంటారు. పురాణాల ప్రకారం మనిషి తన జీవిత కాలంలో చేసిన పాపాలు, అహంకారం శిరోజాలకు అంటి ఉంటాయని, అలాంటి శిరోజాలను స్వామికి సమర్పించి తాము చేసిన పాప కర్మలు తొలగి పోవాలని ఇలా చేస్తుంటారు. వివాహమైన మహిళ భర్త ఉండగా శిరోజాలను తొలగించడం హిందూ సంప్రదాయానికి విరుద్ధం. దీంతో మహిళలు మూడు కత్తెర్ల రూపంలో స్వామికి మొక్కుబడులు చెల్లిస్తుంటారు. శిరోజాలు మనిషి అందానికి ప్రతీక, హుందాగా భావిస్తారు. అలాంటి శిరోజాలను సమర్పించి స్వామి భక్తిని చాటుకుంటారు. కష్టాలు తీరిన వారు ఎంతో భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించి తమలోని దర్పాన్ని, హుందా తనాన్ని దేవునికి అర్పిస్తున్నట్టు తలనీలాలు సమర్పిస్తారు. అలాగే తలవెంట్రుకల్లో పూర్వజన్మకు సంబంధించిన పాపాలు ముడిపడి ఉంటాయని అందుకే శిశువు జన్మించిన ఏడాది లోపే పిల్లలకు పుట్టువెంట్రుకలు స్వామికి సమర్పిస్తూ బిడ్డను దైవ ప్రసాదంగా భావిస్తారు.

### తలనీలాలకు భలే డిమాండ్..

ప్రపంచ మార్కెట్‌లో తలనీలాలకు మంచి గిరాకీ ఉంది. దీంతో వివిధ ఆలయాల్లో వాటిని పోగుచేసుకుని విక్రయించే హక్కునకు ఏటా లేదా రెండేళ్లకోసారి బహిరంగ వేలం నిర్వహిస్తారు. ఈ క్రమంలో శ్రీవారి క్షేత్రానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్న భక్తుల ద్వారా కోట్లాది రూపాయల మేర ఆదాయం సమకూరుతోంది.. శ్రీస్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలల ద్వారా 2023 - 24 సంవత్సరానికి గాను 6 కోట్ల 30 లక్షల రూపాయల ఆదాయం లభించగా 2020-21లో 3 కోట్లు, 2021-22లో ఏకంగా 11 కోట్ల 97 లక్షలు లభించగా 2022-23 సంవత్సరానికి గానూ 6 కోట్ల 37 లక్షల రూపాయల ఆదాయం బహిరంగవేలాల ద్వారా సమకూరింది.

### కేటగిరిని బట్టి ధర కేటాయింపు

భక్తులు సమర్పించిన తలనీలాలను వివిధ కేటగిరీల్లో విభజిస్తారు. జుట్టు పొడవు ఆధారంగా 5 అంగుళాల నుంచి 31 అంగుళాల వరకూ ఐదువర్గాలుగా విభజించి విక్రయాలు జరుపుతారు. వేలం వేసిన తర్వాత గుత్తేదారులు ఆ జుట్టును నిల్వ చేయడానికి ముందు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగా వాటిని ఉడకబెట్టి, కడిగి ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత బస్తాలలో నిల్వ చేసి వాటిని విక్రయిస్తారు. జుట్టు నాణ్యతను బట్టి ధర ఉంటుంది. నాసిరకం కేజీ 8 నుంచి 10 వేల రూపాయల వరకు ధర పలికితే నాణ్యమైన, పొడవైన జుట్టు కేజీ 20 నుంచి రూ.25 వేల రూపాయలు పైబడి ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. వీటితో తయారు చేసే విగ్గులు వేల రూపాయలు పలుకుతాయి.. ఇతర దేశాల్లో సైతం డిమాండ్ ఉంటుంది.

# కలల పంట..



డ్రాగన్ ఫ్రూట్ సాగు పట్ల రైతుల్లో ఆసక్తి - కేజీ రూ. 400 పై మాటే

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు - పెరుగుతున్న సాగు



దెందులూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పనిభారం లేకపోవడం పెట్టుబడితో పాటు సాగు నీటి అవసరం పెద్దగా లేకపోవడంతో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంట పట్ల ఆసక్తి చూపుతున్నారు. అలాగే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగు క్రమక్రమంగా పెరుగుతోంది. ఒక్కసారి పంట వేస్తే 32 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది. ధర కలిసి రాకపోయినా ఏడాదికి కనీసం రెండున్నర లక్షలు సంపాదించుకోవచ్చు.. అందుకే రైతులు విపరీతంగా ఆసక్తి చూపిస్తున్నారు. గతంతో దెందులూరు నియోజకవర్గంలో ఈ పంట జోలి వెళ్లిన వారే లేరు.. ఇప్పుడు నియోజకవర్గంలో పేదవేగి, సూర్యరావుపేట, రాట్నాలకుంట, కన్నాపురం, దెందులూరు మండలంతో పాటు పలు గ్రామాల్లో సుమారు 180 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు.

### పోషకాల ఘని..

ఈ పండు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధులకు, అజీర్ణ సమస్యలకు బాగా పని చేస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను పిటాయా అని పిలుస్తారు. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో పాటు మనిషి బరువు తగ్గడం, మధుమేహాన్ని అదుపు చేయడం, చర్మ సంరక్షణకు ఉపయోగపడే గుణం ఈ పండులో ఉంది. కరోనా తరువాత వీటీపై ప్రజలకు వాడకం పెరిగింది. దీంతో లాభాలు వస్తుండటంతో రైతులు కుడా పంటను పండించేందుకు ముందుకు వస్తున్నారు.

### భూ పరీక్ష ప్రధానం...

దాదాపు ఎకరం భూమిని ముందుగా భూసార పరీక్షలు చేయించి నేలలో ఉదజని 7శాతం ఉంటే సరిపోతుంది. ముందుగా మడుసార్లు దుక్కుదున్నాలి. ఏడు అడుగుల ఎత్తున్న సిమెంట్ స్తంబాలను ఏర్పాటు చేసి మొదటి సారి ఎకరానికి అన్ని ఖర్చులతో కలిపి సుమారు 4 లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరా విస్తీర్ణంలో దాదాపు 500 సిమెంట్ స్తంబాలకు 1500 నుంచి 2 వేల మధ్య డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచవచ్చు. తరువాత సంవత్సరానికి 10 వేలు నుంచి 20 వేలు మాత్రమే పెట్టుబడి పెడితే సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

### పంట దిగుబడి...

సీజన్‌లో ఒక్కో చెట్టుకు కనీసం 15 నుంచి 18 పళ్లు కాస్తాయి. వీటిని కిలో 250 నుంచి 300 రూపాయల వరకు మార్కెట్‌లో అమ్ముతారు. సీజన్లో కిలో 150 నుంచి 400 రూపాయల వరకు ఉంటుంది. సంవత్సరానికి రెండు పంటల చొప్పున 32 సంవత్సరాల వరకు రైతులు ఆదాయం తీస్తారు. ఇప్పుడు రైతుల వద్దకు వచ్చి డ్రాగన్ ఫ్రూట్‌ను ఒక్కొక్కటి వంద చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మార్కెట్‌లకు తరలిస్తున్నారు

### పంటపై ప్రచారం అవసరం...



సాగు నీటి వినియోగం తక్కువ, పెట్టుబడి తక్కువ, నష్టాలు లేని పంటనే రైతులు ఎన్నుకోవాలి. అలాంటి కోవకు చెందిన పంటే డ్రాగన్ ఫ్రూట్.. ఈ పంటపై ప్రభుత్వం ప్రచారం చేయాలి. నేను ఈ పంట వేసినప్పుడు బయపడ్డాను. ఇప్పుడు ధైర్యంగా ఉంది.. ఎకరాకు రెండు లక్షల వరకు లాభం వచ్చింది.

గొరిపర్తి శ్రీనివాస్ (కొవ్వలి)

## కోలమూరులో సురభి మాయాబజారుకు ఫిదా..



కోలమూరులో మాయబజారు నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

ఉండి, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మాయా బజార్ పౌరాణిక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రసార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీసంతాన గోపాలస్వామి దేవస్థానం కోలమూరు గ్రామంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా సురభి నాటకోత్సవాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. తెలంగాణ వనస్థలి పురానికి చెందిన ఆర్.వేణుగోపాలరావు శ్రీవినాయక నాట్యమండలి (సురభి) నేషనల్ థియేటర్ ఆర్.వేణుగోపాలరావు బృందంచే అద్భుతంగా మాయబజారు నాటకాన్ని ప్రదర్శించారు. ఈనాటకాన్ని తిలకించడానికి కోలమూరు నలుమూల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నాటక కళాకారులను అభినందించారు. నాటకాలను ఆలయ కమిటీ అధ్యక్షులు బదిరీ నారాయణరాజు, కార్యనిర్వహణాధికారి మంతెన రామరాజు, రుద్రరాజు రవికుమార్ రాజు, నంబూరీ బలరామ రాజు, పేరిచర్ల శ్రీనివాస రాజు, ఆర్. అప్పలరాజు, ఆర్. నరసిం హరాజు, కెవిరాజు, ముదునూరి సతీష్ రాజులు నిర్వహించారు.

# చారిత్రక ఆనవాళ్లకు సమాధి..

మూడు వేల ఏళ్ల నాటి చరిత్ర కాలగర్భంలో కలిసిపోనుంది. ఆదిమ మానవులు సంచరించిన ఆనవాళ్లు చూడలేమంటూ రుద్రమ్మ కోట గ్రామస్థుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పోలవరం ముంపుతో ఇక తమ గ్రామం కథలకే పరిమితమనే గ్రామస్థుల మాటలు గుండెల్లో భారాన్ని మరింత బరువెక్కిస్తున్నాయి...

పోలవరం ముంపులో రుద్రమ్మకోట గ్రామం

జరగబోయే ఘటనతో గ్రామస్థుల కంట నీరు

మూడు వేల ఏళ్ల నాటి చరిత్రకు చెల్లు



ఆదిమ మానవుల సమాధి



సమాధుల్లో లభించిన విలువైన పూసలు

వేలేరుపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే నిర్వాసితులకు జరిగే నష్టం ఆపారం.. ఇదే క్రమంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అనవాళ్ళు కూడా పూర్తిగా జలసమాధయ్యే ప్రమాదం ఉంది. చరిత్రకు ఆనవాళ్లుగా తమ గ్రామం నిలిచిందని ఆ గ్రామస్థులు అనేక సందర్భాల్లో సంతోషంతో పాటు విచారం వ్యక్తం చేస్తుంటారు. వాళ్ళ సంతోషాలు ఆవిరి చేస్తూ పోలవరం ప్రాజెక్టు తమను మింగేస్తుందని వాపోతున్నారు. మరికొద్ది కాలంలోనే ఆయా ప్రాంతమంతా జలమయం అయ్యి ఊళ్ళకు ఊళ్ళే మునిగిపోనున్నాయి. ఆ కోవలోనే రుద్రమ్మకోట గ్రామం కూడా ఉంది. ఈ గ్రామం ప్రత్యేకత ఏమిటంటే ఆదిమానవులు వేల సంవత్సరాల క్రితమే ఈ గ్రామంలో నివసించినట్లు ఆధారాలున్నాయి. అలాగే అనాటి మానవులకు సంబంధించిన అస్తికలు, వారు ఉపయోగించిన వస్తువులు వారి సమాధుల్లో లభ్యమయ్యాయి. ఇప్పుడు అవన్ని కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది.

### ఇదీ చరిత్ర...

మూడు వేల ఏళ్ళనాటి ఆదిమానవ ఆనవాళ్ళను పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని రుద్రమ్మ కోట గ్రామం వద్ద పురావస్తు శాఖ నిపుణులు గుర్తించారు. 2018లో పురావస్తు శాఖ అధికారులు రుద్రమ్మకోట గ్రామ సమీపంలోని గుట్టల వద్ద అతిభారీ సమాధులను గుర్తించారు. ఈ సమాధుల్లో ఏముందో తెలుసుకునేందుకు తవ్వకాలు చేయగా అనేక విశేషాలతో కూడిన ఆది మానవుల ఉనికికి సంబంధించిన వివరాలు బయటపడ్డాయి. క్రీస్తు పూర్వం 1750 నుంచి 2500 సంవత్సరాల మధ్యకాలంలో ఇనుము తొలి సారిగా ఉనికిలోకి వచ్చినట్లు ఇప్పటిదాక భావించారు. అయితే అంతకన్న 500 ఏళ్ళకు ముందే ఇనుప ఖనిజంతో చేసిన సాధనాలను వాడినట్లు సమాధుల్లో బయటపడ్డ ఇనుముతో తయారు చేసిన ఆయుధాల ద్వారా నిరూపితమైంది. ఆది మానవులు గృహ అవసరాల కోసం వాడిన మట్టి పాత్రలు సమాధుల్లో దొరికాయి. వీటితో పాటే స్త్రీ, పురుష అలంకారాల కోసం వాడే పూసలు కూడా లభించాయి. ఇందులో అత్యంత విలువైన కార్నీలియాన్ జస్‌పాల్ అగేజ్‌పేస్ట్, ఐవరి, స్ఫటికమార్బుల్‌తో తయారు చేసినవి మంచి డిజైన్లతో ఈ పూసలు లభించాయి.

### చరిత్ర చెప్పే సాక్ష్యాలు...

ఆనాటి ఆదిమానవులు భారీకాయులుగా ఉండే వారని నిర్ధారించేందుకు ఇక్కడ సమాధులను పరిశీలిస్తే అర్ధమవుతోంది. చనిపోయినవారిని దహనం చేసిన తరువాత మిగిలిన అస్తికలు, వారువాడిన వస్తువులను ఆరడుగుల వెడల్పు, పది అడుగుల పొడవుగల సమాధులు నిర్మించి వాటిలో భద్రపరిచి రక్షణగా పెద్దబండరాయిని సమాధులపై ఉంచారు. ఇటువంటి సమాధులు అనేకం రుద్రమ్మకోట సమీపంలోని గుట్టల్లో దర్శనమిస్తున్నాయి. ఇంతటి చరిత్ర కలిగిన గ్రామం తన పూర్వపు వైభవాన్ని కొల్పోయే ప్రమాదం పోలవరం ప్రాజెక్టు ద్వారా పొంచి ఉంది.





ఆదిమ మానవులు వినియోగించిన ఇనుప ఆయుధం, మట్టి పాత్ర

## ముగిసిన ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు



శేషవాహనంపై కొలువై తిరువీధులకు బయలుదేరిన శ్రీవారు, అమ్మవార్లు.

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన శ్రీవారు క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. చిన్నవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను దేవస్థానంలో పదిరోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ఆవరణలో జరిగిన పూజాధికాల అనంతరం స్వామి, అమ్మవార్లను వెండి శేషవాహనంపై ఉంచి అలంకరించి అట్టహాసంగా క్షేత్రపురవీధుల్లో ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన స్వామి, అమ్మ వార్లకు భక్తులు హారతులు పట్టారు.

# గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి కృషి

**ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు**



ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, అధికారులు

పోలవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల్లో పర్యాటక విస్తరణ చేయడం కోసమే పర్యటన చేస్తున్నట్లు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టుకి చేరుకున్న ఆయన అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మగండి ప్రాంతానికి చేరుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రంపచోడవరం సీఐ సాయి ప్రశాంత్, పోలవరం సీఐ బాల సురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్ కుమార్ వారికి పూలబొకేలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ ప్రత్యేక పర్యాటక బోటులో పాపికొండలకు తరలి వెళ్లారు. మార్గమధ్యలో పేరంటాలపల్లి శివక్షేత్రాన్ని సందర్శించిన అనంతరం నదీ తీరం వెంబడి ఉన్న గిరిజన గ్రామాల్లో పర్యటించి చైర్మన్ అక్కడి గిరిజనులతో మమేకవుతారని, అనంతరం భద్రాచలం, పర్ణశాల సందర్శిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు గునపర్తి చిన్ని, ఆటపాకల వెంకటేశ్వరరావు, తెలగంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

# పెరుగుతున్న మధుమేహ కేసులు

**అవగాహన లేకుంటే ప్రాణాపాయం.. భీమవరంలో ఉచిత వైద్య శిబిరం**

భీమవరంటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ కేసులు పెరిగి పోతున్నాయని, ఈ వ్యాధి గురించి అవగాహన లేక ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పలువురు వక్తలు అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), పత్సమట్ల ధర్మరాజు, తెలంగాణ ఎమ్మెల్యే రమణరెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, లండన్ వైద్యులు కే.వేణు ప్రారంభించారు. దాదాపు రెండువేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహ రాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, డాక్టర్ పిఆర్కే వర్మ, అల్లూరి సాయి దుర్గారాజు, పేరిచర్ల సుభాష్, గోకరాజు పాండు రంగరాజు, గోకరాజు రామరాజు (రామం) జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఉండి వాసు పాల్గొన్నారు. దాదాపు 15 పైగా ఏర్పాటు చేసిన రూముల్లో రోగులకు వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు.

# కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

**సీఎం, డిప్యూటీ సీఎం లకు జోగయ్య బహిరంగ లేఖ**

పాలకొల్లు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల ఈడబ్ల్యుఎస్‌కి 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 103వ రాజ్యాంగ సవరణ చేసిన దరిమిలా కాపు కులస్థులకు విద్య, ఉద్యోగాల్లో 10శాతం కోటాలో 5శాతం కలగజేస్తూ జగన్ పాలనకు ముందు అప్పటి సీఎం చట్ట సభల్లో ఆమోదించి గవర్నర్ ఆమోదం పొందటం జరిగిందని వాటిని యాథాతథంగా ఇప్పుడు అమలు చేయాలని మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంటక హరిరామ జోగయ్య సోమవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు బహిరంగ లేఖ రాశారు. ప్రతులను సోమవారం పాలకొల్లులో పత్రికలకు విడుదల చేశారు. ఈడబ్ల్యుఎస్ కోటాలో 5శాతం కాపులకు ఇవ్వాలని జీవో నెంబరు 45 2019 మార్చి 8వ తేదీన గెజిట్ పబ్లికేషన్ ఇవ్వటం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత ధోరణితో వ్యవహరించారని లేఖలో జోగయ్య పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించానని తెలిపారు. 10శాతం కోటాలో 5శాతం కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు కేటాయించడం న్యాయసమ్మతం కాదంటూ 14వ నెంబరు చట్టాన్ని కొట్టివేయాలంటూ అగ్రవర్ణాల వారు హైకోర్టులో వ్యాజ్యం వేశారని తెలిపారు. అయితే రాష్ట్రం మొత్తం జనాభాలో కాపు కులస్థులు 20శాతం ఉండగా మిగిలిన అగ్రకులాలు అన్నీ కలిపినా 25శాతం కూడా లేని మాట వాస్తవమని ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ గత ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌నే సమర్ధిస్తూ మాట్లాడటం వల్ల కాపులకు రిజర్వేషన్ విషయంలో నేటి ప్రభుత్వం నిర్ణయం ఏమిటో ఈనెల 28వ తేదీన జరిగే విచారణలో తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు.





# మ్యూజికల్ హిట్స్‌తో ఉర్రూతలు

భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కోటికలపూడి గోవిందరావు కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు భీమవరానికి చెందిన వంశీ ఆర్కెస్ట్రా నిర్వహించిన సినీ మ్యూజికల్‌నైట్ ఆకట్టుకుంది. పలు చిత్రాల్లోని సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను హుషారెత్తించారు. మధ్యాహ్నం మూడు గంటలకు జువ్వలపాలెంలోని బాలాంజనేయ భజన సమాజం వారిచే భజన, సాయంత్రం 4 గంటలకు అడబాల సత్యనారాయణమూర్తి కేశన పల్లివారిచే భక్తి రంజనీ, రాత్రి 8 గంటలకు మావుళ్ళమ్మ నాట్యమండలి వారిచే రంగస్థల ఆణిముత్యాలు ప్రదర్శించారు.

# కోళ్లకు అంతుచిక్కని వైరస్



**» గంటల వ్యవధిలోనే మృత్యువాత » కోళ్ల పెంపకందారుల ఆందోళన**

పెంటపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కోళ్లకు అంతుచిక్కని వైరస్ పట్టి పీడిస్తున్నది. సాయంత్రం ఆరోగ్యంగా కనిపించే కోడి ఉదయానికి మృత్యువాత పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో కొన్ని రోజులుగా సుమారు లక్షకు పైగా కోళ్ళు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ సుమారు నెల రోజుల ముందు నుంచి అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. పందేల కోసం నెలల తరబడి కంటికి రెప్పలా పెంచిన పందెం కోళ్లు కూడా చాలా వరకు మృతి చెందాయి. కోళ్ల పెంపకందారులు లక్షల రూపాయలు నష్టపోయారు. కోళ్ల సంఖ్య తగ్గిపోవడంతో చాలా బరుల్లో పందేలు కూడా పస లేనట్లుగా సాగాయి. కనీసం జోడీలు కూడా దొరకలేదు.

### నాలుగేళ్ళ క్రితం ఇదే వ్యాధి

కోళ్లకు వచ్చిన ఈ వ్యాధి కొత్తదేమి కాదు. నాలుగు సంవత్సరాల క్రితం ఈ వ్యాధి సోకి అనేక కోళ్లు మృత్యువాత పడ్డాయి. అప్పుడు ఎందుకు చనిపోతున్నాయో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో పెంపకందారులు తీవ్ర ఆవేదన చెందుతూ వచ్చారు. వైరస్ సోకడంతో అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ధరలు పూర్తిగా పతనమయ్యాయి. పెంపకందారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారు. వైరస్ తగ్గుముఖం పట్టడానికి అప్పుడు చాలా రోజులు సమయం తీసుకుంది. ఇప్పుడు మరలా అదే వైరస్ కోళ్లకు వచ్చినట్లుగా సంకేతాలు కనిపిస్తున్నాయి.

### వైరస్ లక్షణాలు తెలియవు

ఈ వైరస్ సోకిన కోడికి వైరస్ లక్షణాలు ఏమీ కానరావు. ఉదయం బాగా ఉన్న కోడికి ఒకవేళ వైరస్ సోకితే తిరుగుతూనే చనిపోతుంది. ఈ వైరస్ నేరుగా కోడి గుండెపై ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. వైరస్ సోకిన కోడికి గుండెనిండా నీరు పట్టేయడం వల్ల గుండెపోటు లాంటిది సంభవించి చనిపోతుంది. ఒకవేళ వైరస్ సోకిన కోడిని కనిపెట్టి వ్యాక్సిన్ వేయించినా ఫలితం ఏ మాత్రం ఉండదు.

### జిల్లాలో లక్షకు పైగా కోళ్లకు వైరస్

పశ్చిమగోదావరి జిల్లాలో కొన్ని రోజులుగా లక్షకు పైగా కోళ్లకు వైరస్ సోకినట్లు తెలుస్తోంది. దీంతో పెంపకం నిర్వాహకులు ఆర్థికంగా చాలా వరకు నష్టపోయారు. వైరస్ ఇంకా ప్రబలితే గతం మాదిరిగా ముందు ముందు కోడి ధరలు ఎక్కడ పతనమవ్వైపోతా యోనని పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. ఈ కోళ్ల మాంసం తినకూడదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

### వైరస్ పరిధి మూడు కిలో మీటర్లు

వైరస్ సోకిన కోడి కారణంగా సుమారు 3 కిల్లోమీటర్ల దూరంలో ఉండే మరో కోడికి వైరస్ సోకే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. దీంతో ఈ వ్యాధి తీవ్రత ఎంతో దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు. పౌల్ట్రీలో ఒక కోడికి వైరస్ సోకితే మిగిలిన అన్ని కోళ్లకు కూడా గంటల వ్యవధిలోనే వైరస్ సోకి కోళ్లు మొత్తం మృత్యువాత పడతాయి.



పెంటపాడు కాలువ వద్ద వైరస్‌లో మృత్యువాతపడ్డ కోళ్ళను సంచులలో కట్టి పడేసిన వైనం

## రోడ్డు పక్కన కోళ్ల కళేబరాలు

వైరస్ కారణంగా మృత్యువాత పడిన కోళ్లను చాలా మంది సంచులలో వేసి రహదారుల పక్కనే పడేస్తున్నారు. ఇది చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల చుట్టు పక్కల ఉండే కోళ్లకు అతి వేగంగా ఈ వైరస్ సోకే అవకాశం ఉందంటూ హెచ్చరిస్తున్నారు. వైరస్ కారణంగా కోళ్లు చనిపోతే వాటిని ఊరికి దూరంగా తీసుకువెళ్ళి కాల్చేయడం గాని లేదా సుమారు 3 అడుగుల గొయ్యిని తీసి అందులో సున్నం వేసి పూడ్చటం గాని చేయాలంటున్నారు. లేకపోతే చనిపోయిన కోళ్ల కారణంగా మరిన్ని కోళ్లు మృత్యువాత పడతాయంటూ హెచ్చరిస్తున్నారు.

# నేడు ఉమ్మడిజిల్లా విద్యాధికారుల సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలవిద్యలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ప్రతిపాదించిన ఐదురకాల బడులపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సమావేశం నిర్వహిస్తున్నారు. ఉమ్మడిజిల్లాలోని ఐదు డివిజన్ల ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశ మవుతారు. ప్రభుత్వ విద్యారంగానికి ఉపాధ్యాయులకు గత వైసీపీ ప్రభుత్వం అమ ల్లోకి తెచ్చిన జీవో 117పై ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతల నేపథ్యంలో వివాదాస్పద ఈ జీవోను రద్దు చేస్తున్నట్టు ఇటీవల ప్రకటించిన కూటమి ప్రభుత్వం దానిస్థానే ప్రత్యా మ్నాయాలపై పలు ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా ప్రస్తుతం వున్న ఆరురకాల బడులస్థానే ఐదురకాల బడులను క్లస్టర్ల వారీగా పంచాయితీని యూనిట్‌గా కొత్తగా ఏర్పాటుచేయతలపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్ళు విద్యార్థుల సంఖ్యఆధారంగా ఏర్పాటయ్యే శాటిలైట్, ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, ప్రస్తుత హైస్కూళ్ళగురించి ప్రభుత్వ ప్రతిపాదనలను ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు వివరించి, జిల్లాలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు, సాధ్యాసాధ్యాల గురించి తెలుసుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రారంభ మయ్యే ఈ సమావేశం రాత్రి 7 గంటల వరకు కొనసాగే అవకాశం ఉంది.

# ఈ సారి తెలంగాణలో బీజేపీదే అధికారం

**కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి**



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి

భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణాలో రాబోయే 45 నెలల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది రాసి పెట్టుకోండి' అని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. భీమవరంలో సోమవారం సినీ హీరో కృష్ణంరాజు జయంతి సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ తప్పొప్పులను కోర్టు నిరూపిస్తుందన్నారు. ఆయన క్రాస్ పిటిషన్ వేస్తే అది కొట్టేసిందని, సుప్రీం కోర్టుకు పోయినా కచ్చితంగా విచారణ చేయాలని చెప్పడంతో తప్పు జరిగినట్టు తెలుస్తోందన్నారు. తప్పుచేసినవాడు ఎంతటి వాడైనా శిక్షకు అర్హులని, ఇందులో రాజకీయ కక్షలు లేవన్నారు. కేటీఆర్ అధికారంలో ఉన్న పదేళ్లు ఎటువంటి వాతావరణాన్ని సృష్టించారు అనేది గ్రామాల్లోని ప్రజలందరికీ తెలుసు. కార్పొరేషన్ చైర్మన్‌లు మొదలుకొని స్పీకర్ వరకూ అందరూ విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఆ పర్యటన వల్ల వచ్చే లాభం ఎంతంటే పేపర్ మీద చూపించే తెలివి ఒక్కరికీ లేదని ఎద్దేవా చేశారు. పర్యటన చేసొచ్చానా.. ఇన్ని కోట్ల ఖర్చు అయినాయి, దీనికి వెయ్యింతలు అవకాశాలు, ఇండస్ట్రీస్ వచ్చాయి.. లాభాలు వచ్చాయని ఏదైనా ఇక్కడ చూపించారా అని ప్రశ్నించారు. ఎవరైనా చూపిస్తారా.. ఆ దమ్ము ధైర్యం ఉన్న వాడే విదేశీ ప్రయాణాలు చెయ్యాలని అన్నారు

# మంత్రికి సహకార ఉద్యోగుల వినతి

ముదినేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం మంత్రిని రాష్ట్ర సచివాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు 2019, 2024 పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 2019 ఏప్రిల్ 1 నుంచి సంఘాల్లో సిబ్బంది నియామకాలు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

# వృద్ధుల సమస్యలపై 371 ఫిర్యాదుల పరిష్కారం

**ఏడీ రామ్‌కుమార్**

ఆకివీడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 524 ఫిర్యాదులు నమోదు కాగా 371 కేసులు పరిష్కరించినట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ సంచాలకులు రామ్‌కుమార్ తెలిపారు. ఆకివీడు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విచారణ దశలో 153 దరఖాస్తులు ఉన్నాయన్నారు. వయోవృద్ధులు వారి పిల్లలకు తమ ఆస్తులు రాసి ఇచ్చినా సక్రమంగా చూడకుండా వేధిస్తున్న 36 మందికి సంబంధించి ఆస్తులను తిరిగి వెనక్కి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. వివిధ స్వచ్ఛంద వృద్ధాశ్రమాల ద్వారా 180 మంది వృద్ధులకు పూర్తిస్థాయి ఆశ్రయం కల్పించడం జరుగుతుందన్నారు. వయోవృద్ధుల సంఘాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటి వరకు అర్హులైన 11901 వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేయడమైందన్నారు. వృద్ధులు తమ సమస్యలు తెలియజేయవచ్చునని తెలిపారు.

# 31 వరకు 'ఇగ్నో' కోర్సుల్లో ప్రవేశాలకు గడువు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) దూరవిద్య, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, 'ఇగ్నో' స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లను ఇగ్నో వెబ్‌సైట్ లింక్‌ద్వారా ఈ నెల 31వరకు పొంద వచ్చునన్నారు. వివరాలకు స్టడీసెంటర్ ఫోన్ నెంబరు 94903 50469లో సంప్రదించాలన్నారు.

## క్రైమ్ కార్నర్



# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

బుట్టాయగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి ఇంటిముందు యువతి ధర్నాకు దిగిన సంఘటన బుట్టాయగూడెంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలు ప్రకారం.. బుట్టాయగూడెం అరుంధతిపేటకు చెందిన మర్రి ప్రణీత అదే గ్రామానికి చెందిన ఉందుర్తి నవీన్ కుమార్‌లు రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. మైనార్టీ తీరేంత వరకు ప్రేమ వ్యవహారం సాగించాడని, మైనార్టీ తీరిన తర్వాత పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడని తెలిపింది. ఇప్పుడు మైనారిటీ తీరిన యువతి పెళ్ళి చేసుకోమని అడగ్గా తన కుటుంబీకులు ఒప్పుకోవ డంలేదని చెబుతున్నాడని, పెళ్ళికి నిరాకరిస్తున్నాడని విలపించింది. తనపైన, తన తల్లి, పిన్ని పైన నవీన్‌కుమార్ కుటుంబీకులు దాడి చేశారని వివరించింది. తనను వదిలించుకునేందుకు కుట్ర చేస్తూ వేధిస్తున్నాడని వాపోయింది. తనను పెళ్ళి చేసుకునేంత వరకు నవీన్‌కుమార్ ఇంటి ముందు నుంచి వెళ్ళనని భీష్మించింది. న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తానని ప్రణీత స్పష్టం చేసింది. బాధితురాలు ధర్నాకు దిగడంతో నవీన్‌కుమార్ కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పరారైనట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు తెలిపారు. ఉదయం నుంచి ప్రణీత ఏమి తినకపోవడంతో నీరసించిందని కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

# లారీ ఢీకొని యువకుడి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

ఏలూరు క్రైం/కామవరపుకోట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక యువకుడిని ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన గోళ్ళ శ్రీనివాసరావు (31) సెంట్రింగ్ పనులు చేస్తూ తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. జంగారెడ్డిగూడెంలో సెంట్రింగ్ పనులు చేసే నిమిత్తం సోమవారం ఉదయాన్నే తన ఇంటి వద్ద నుంచి మోటారు సైకిల్‌పై బయలుదేరి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో తడికలపూడి సినిమాహాల్ దాటిన తరువాత మలుపు వద్ద ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ శ్రీనివాసరావును ఢీకొంది. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొద్ది సేపటికే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం వద్ద విశాఖ వైపు వెళ్లే రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్సై అప్పారావు తెలిపారు. మృతుడు 45 సంవత్సరాల వయస్సు కలిగి బ్లూ కలర్ బనియన్, బ్లాకలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని వివరించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

## చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

జంగారెడ్డిగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీన స్థానిక పద్మ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో పట్టణానికి చెందిన మడ్డి దుర్గారావు (45)తీవ్రంగా గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా చికిత్స పొందుతూ 19వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి.ఉమా మహేశ్వరరావు తెలిపారు.



ఎక్స్‌రేలో కనిపిస్తున్న బాలుడి గొంతులో ఇరుక్కున్న నాణెం

## బాలుడి గొంతులో నాణెం తొలగింపు

ఏలూరు అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరానికిచెందిన ఓ బాలుడు(8) పది రూపాయల నాణేన్ని ఆదివారంరాత్రి మింగివేయడంతో గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబీకులు హుటాహుటిన స్థానిక ఆయుష్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ వెంకట జయదీప్ నేతృత్వంలోని వైద్యబృందం ఆదివారం అర్థరాత్రి సమయంలో ఎండోస్కోపి ద్వారా నాణేన్ని విజయవంతంగా బయటకు తీశారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడిని రక్షించినందుకు ఆయుష్ ఆస్పత్రి వైద్యులకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పీక కోసి హత్యాయత్నం



గణపవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన బొడ్డి కృష్ణను గుర్తు తెలియని వ్యక్తులు చాకుతో పీక కోసి హత్యాప్రయత్నం చేసిన సంఘటన గణపవరం మండలం ముగ్గళ్ళ గ్రామ శివారులో జరిగింది. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం బొడ్డు కృష్ణను హత్య చేయాలనే తలంపుతో ఆయన్ను ఆదివారం రాత్రి సుమారు 10గంటలకు ముగ్గళ్ళ గ్రామ శివారులోకి తీసుకొచ్చి చాకుతో పీకకోసి పరారయ్యారు. రక్తగాయాలతో కొట్టుమిట్టాడుతున్న కృష్ణను దారినపోయే వ్యక్తుల సాయంతో 108ద్వారా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కృష్ణ వాంగ్మూలం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## బాలికను వేధిస్తున్న మైనర్‌పై పోక్సో కేసు

ద్వారకాతిరుమల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నాని పలుసార్లు అత్యాచారం చేసిన ఓ మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టి సుధీర్ తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక జంగారెడ్డిగూడెంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈక్రమంలో అదే కాలేజీలో అదే క్లాసు చదువుతున్న జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన మైనర్ మాయమాటలు చెప్పి పలుసార్లు అత్యాచారం చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సదరం సర్టిఫికెట్ల పరిశీలన

తణుకు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వ్యాప్తంగా సదరం సర్టిఫికెట్ల లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. సోమవారం పలు ప్రాంతాల నుంచి లబ్ధిదారులు రాగా నాలుగు విభాగాలకు సంబంధించి 140 మంది లబ్ధిదారుల సర్టిఫికెట్లు పరిశీలించారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, కుర్చీలు, టెంట్లు ఏర్పాటు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వీరవాసరం/భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భీమవరం 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలంలో అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని తెలిపారు.

**పాలకోడేరు:** విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, కోడవల్లి, మోగల్లు, వేండ్ర, వేండ్ర అగ్రహారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

అత్తిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ జిల్లా అధ్యక్షుడు యాతం రాంబాబు తెలిపారు. ఎలాంటి కంటి సమస్యలున్నా ఉచితంగా సేవలు అందిస్తారని తెలిపారు. అత్తిలి పరిసర గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## నరసాపురంలో ఐదు చోట్ల ఆధార్ సీడింగ్ కేంద్రాలు

నరసాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఐదు చోట్ల ఆధార్ సీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. పట్టణంలోని వనువులమ్మ ఆలయం, కృష్ణబాబుకాలనీ, గంటాలమ్మ ఆలయం, ఎన్టీఆర్‌కాలనీ, కొండాలమ్మ ఆలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. తప్పులు సరిచేయడంతో పాటు కొత్తగా నమోదు చేస్తారని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పని చేస్తాయన్నారు.

## తెన్నేటి మాస్టారుకు పురస్కారం

పాలకోడేరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు జడ్పీ హైస్కూలులో తెలుగు పండిట్‌గా పని చేస్తున్న అక్షర కిరీటి తెన్నేటి మాస్టారుకు అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించారు. నేడు విజయవాడలో పురస్కారంతో తెన్నేటి మాస్టారును సన్మానిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ తెలియజేశారు. పలువురు తెన్నేటి మాస్టారును అభినందించారు.

## పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం: ఆరిమిల్లి

తణుకు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తణుకు జిల్లా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డులో అందించే సేవలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి కొత్త పాలకవర్గం నియమించి రోగులకు మెరుగైన సేవలందించడం జరుగుతుందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ పాల్గొన్నారు. విద్యార్థులు చదువులో రాణించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో స్మార్ట్ ఆంధ్ర హ్యాకథాన్-2024లో ప్రతిభకనబర్చిన చైతన్య విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసారు. హెచ్‌ఎం ఆకుల సురేఖ, డీన్ శ్రీనివాసరావు, ఏవో రాము పాల్గొన్నారు.

## ఆరోపణల నిగ్గు తేల్చాలి

భీమవరం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తోందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి సోమవారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డిని కలిసి ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పుదోవ పట్టించే విధంగా స్కూల్ నిర్వహణ కొనసాగుతున్న ఆరోపణలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రతి వినతికి న్యాయం చేయాలి

నరసాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతికి న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవో దాసి రాజు అధికారుల్ని అదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 30 మంది నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### మొగల్తూరులో 3 వినతులు

**మొగల్తూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు.

# సంపద కాదు.. సమస్యల సృష్టి

## రహదారిపై గుట్టగా చెత్త



మంచిలిలో నిరుపయోగంగా సంపద కేంద్రం

అత్తిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణలో ఆదాయం సమకూరేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లక్షల వ్యయంతో షెడ్లు, కుండీలు నిర్మించారు. గ్రామాల్లో హరిత రాయబారులను నియమించి ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఎరువు తయారు చేసేవారు. ఈ ఎరువు విక్రయించగా వచ్చిన ఆదాయం పంచాయతీ అభివృద్ధికి పనులకు వినియోగించాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియ నిలిచిపోయింది. సంపద కేంద్రాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం మంచిలిలో చెత్త సంపద కేంద్రం మూత పడింది. లక్షలతో ఏర్పాటు చేసిన పరికరాలు మూలకు చేరాయి. లక్షలతో నిర్మించిన షెడ్డు నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. చెత్తను రహదారిపై వేస్తున్నారు. సంపద కేంద్రాలలో పిచ్చి మొక్కలు పెరిగి పోయాయి. చెత్తను రహదారిపై వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



రహదారిపై చెత్త వేస్తున్న దృశ్యం

# కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళతా : ఆరిమిల్లి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్యకర్తల కోసం ఎంత దూరం అయినా వెళతానని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. పెద్దమనిషి కారుమూరి నాగేశ్వరరావు వైసీపీ కార్యకర్తపై తాను దాడి చేశానని, బూతులు తిట్టానని ఉన్నవీ లేనివీ కల్పించి చెపుతున్నాడని, పోలీసులుకు ఫిర్యాదు చేశానని మొసలి కన్నీరు కారుస్తున్నాడని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్నపుడు అధికార మదంతో టీడీపీ కార్యకర్తలు, నాయకులుపై ఏ విధంగా దౌర్జన్యం చేసి ఇబ్బందులు పెట్టారో, ఎన్ని కేసులు పెట్టారో గుర్తుచేసుకోవాలని, ఇప్పుడేదో ఏదో గొప్పవాడిలాగా కబుర్లు చెబుతున్నావని కారుమూరినుద్దేశించి అన్నారు. తాను వైసీపీ కార్యకర్తను తిట్టినట్లు గాని, ఏదైనా చేసినట్లుగాని రుజువు చేయగలవా అని పేర్కొన్నారు. తనను నన్ను తిట్టినట్లు ఎస్‌ఐ సాక్ష్యం అని తెలిపారు. ఇక్కడ చాలా మంది నీ బాధితులు ఉన్నారని, అధికారంలో ఉన్నపుడు కేసులు పెట్టించి, ఇబ్బందులు పడిన వారే అన్నారు. తమ కార్యకర్తలు కోసం ఎంత దూరం అయినా వెళ్తామన్నారు. అలాగే మమ్మల్ని కించపర్చి కవ్విస్తే దానిని కూడా అడ్డుకుంటామని పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు మట్టా వెంకట్ మాట్లాడుతూ తాను వైసీపీలో ఉన్నప్పుడు తన ఎదుగుదలను చూసి ఓర్వలేని కారుమూరి తనపై మూడు అట్రాసిటీ కేసులు, రౌడీ షీటు పెట్టించిన ఘనుడు అన్నారు. వేల్పూరులో వైసీపీ ప్లీనరీలో తనను సీఐతో బూటుకాలుతో తన్నించి, ఈడ్చుకెళ్ళి కేసు పెట్టించిన విషయం మర్చిపోయావా అన్నారు. టీడీపీ నాయకుడు మల్లిన రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకుంటున్న తనను టౌన్ స్టేషన్‌కు అకారణంగా తీసుకెళ్ళి కూర్చోపెట్టిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. మాజీ కౌన్సిలర్ కుప్పాల ఇందిరా దేవి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తుంటే పోలీసులను ఇంటికి పంపి తనిఖీలు చేసి కేసు పెట్టించావని గుర్తు చేశారు. జనసేన వీరమహిళ పిల్లాడ ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళనని కూడా చూడకుండా వైసీపీ శ్రేణులతో కొట్టించి కేసులు పెట్టించావని ఆరోపించారు. టీడీపీ నాయకుడు నౌడగల బాలాజీ మాట్లాడుతూ అకారణంగా పోలీసు స్టేషన్ కూర్చోపెట్టి తమ కులం వారితోనే ఫిర్యాదు చేయించి ఇబ్బందులు పెట్టించిన వ్యక్తి కారుమూరి అన్నారు. ఐటీడీపీ కన్వీనర్ చిత్తజిల్లు సత్తిబాబు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా ఇష్టం వచ్చినట్లు ఫేక్ ఖాతాల ద్వారా కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టించిన సందర్భాలు ఉన్నాయన్నారు. తనకేం జరిగినా కారుమూరి, వైసీపీ కార్యకర్తలదే బాధ్యత అన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు చదలవాడ నాని మాట్లాడుతూ ప్రజల పక్షాన మాట్లాడినప్పటికి కేసులు పెట్టించిన కారుమూరికి ఆరిమిల్లి విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

### పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా : కారుమూరి

**తణుకు రూరల్:** పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఆటో కార్మికునిపై ఎమ్మెల్యే ఆరిమిల్లి కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకులోని వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ తన వాహనంపై తన ఫొటోతో పాటు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు వుండటాన్ని చూసి ఓర్వలేక అధికారులకు ఫోన్‌లు చేసి కేసులు పెట్టించడం దారుణమన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారన్నారు.

## గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తాం : నిమ్మల



పోడూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రోడ్లు, డ్రైన్లు, రక్షిత మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తామని రాష్ట్ర జల వనరులు శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోడూరు మండలంలోని అప్పన్నచెర్వు, పెనుమదం, మట్టపర్రు గ్రామాల్లో రూ.4కోట్లు వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. మోటారు సైకిల్ నడుపుతూ అందర్నీ పలకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటూ మంత్రి నిమ్మల గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, పాలకొల్లు డీసీ చైర్మెన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్‌చైర్మెన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, జిల్లా రైతుకమిటీ ప్రధానకార్యదర్శి రాచకొండ విశ్వనాధం, సర్పంచులు బీరా జాన్‌కుమారి, తానేటి బాబూరావు, దొమ్మేటి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాను కలిసిన కబర్ధి



పాలకొల్లు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షాను పాలకొల్లుకు చెందిన బీజేపీ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి గన్నవరం విమానాశ్రయంలో కలిశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా కొండపావులూరు గ్రామంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ దక్షిణ ప్రాంగణం ప్రారంభోత్సవం బహిరంగ సభల్లో ఆయన పాల్గొని తిరిగి వెళ్లేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా ఆయనను కూటమి నేతలతో వెళ్లి కబర్ధి స్వయంగా కలిసి వీడ్కోలు చెప్పారు. ఈ సందర్భంగా కబర్ధి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అమిత్‌షాను కలిసే అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాజమండ్రి ఎంపీ సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గాదిరాజు బాబుకు ప్రముఖుల పరామర్శ



సోమరాజు చిత్రపటం వద్ద కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ నివాళి

భీమవరం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమవరం డీఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) తండ్రి సోమరాజు ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. సోమవారం నాడు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దంపతులు గాదిరాజు బాబును పరామర్శించి సోమరాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే అంజిబాబు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు గాదిరాజు బాబును పరామర్శించి సోమరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, పి. బాపిరాజు, బండి రమేష్ కుమార్, కారుమూరి సత్యనారాయణ మూర్తి, చిలుకూరి నరసింహరాజు పాల్గొన్నారు.

## సరళాదేవికి అవార్డు



తణుకు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ నాయకురాలు వావిలాల సరళాదేవి బాపు అవార్డు అందుకున్నారు. సోమవారం అమలాపురంలోని కోనసీమ చిత్రకళా పరిషత్ నిర్వహించిన చిత్రకళల పోటీల్లో అవార్డును ఎమ్మెల్సీ కుడిపూడి సర్యనారాయణ, సంస్థ అధ్యక్షుడు కొరసాల సీతారామ స్వామి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు.

## ఉపాధి పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### ఎంపీపీ సోని

నరసాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనులను సిబ్బంది, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీపీ సోని అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్మికులకు వేతనాలు, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? లేదా అన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ ద్వారా చేపట్టిన పనుల్ని తనిఖీ చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో సభలు నిర్వహించి చేపట్టిన పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణం రాజు మాట్లాడుతూ జరిగిన పనులపై ఆడిట్ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తారని, అనంతరం ప్రజావేదిక సభలో జరిగిన పనులపై సమీక్షిస్తామన్నారు. జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎస్ గోవింద్, ఏపీవో వై శ్రీనివాస్, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## పశు పెంపకం పెరగాలి

### ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో సైతం పశుపోషణ నానాటికి తగ్గుతున్న పరిస్థితుల్లో పశు పెంపకం చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

**యలమంచిలి:** పాడిపశువులకు సకాలంలో టీకాలు వేయించడం వల్ల సీజనల్ వ్యాధులు బారినపడకుండా ఉంటాయని తద్వారా పాలదిగుబడి పెరుగుతుందని మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అడవిపాలెం, కొంతేరు గ్రామాల్లో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.

## ఘనంగా కృష్ణంరాజు జయంతి వేడుకలు



భీమవరంటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే గుణం రెబల్ స్టార్ కృష్ణంరాజుకే సొంతమని వక్తలు నివాళులర్పించారు. భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కేంద్ర మాజీ మంత్రి, సినీ హీరో కృష్ణంరాజు జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగ రాణి, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అంజిబాబు, ధర్మరాజు, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆయన జయంతి వేడుకలను పలు సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు నరసింహరాజు, టీడీపీ రాష్ట్ర నాయకు లు మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, డాక్టర్ వీఆర్కే వర్మ, అల్లూరి సాయి దుర్గా రాజు, పేరిచర్ల సుభాష్, గోకరాజు పాండు రంగరాజు, చెనమల్ల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, చెరుకువాడ రంగసాయి, గోకరాజు రామరాజు, డీటీడీసీ బాబు, కృష్ణంరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : బొలిశెట్టి



పెంటపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు క్రీడలలో గుర్తింపు తెచ్చుకున్న ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. విద్యార్థులకు టోర్నమెంట్ ఏర్పాటు చేయడంలో ముందుకు వచ్చిన భాష్యం స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ ఎన్. రమేష్‌బాబు, జెడ్‌ఈవో నారాయణరెడ్డి, లిటిల్ చాంప్ ప్రిన్సిపాల్ కళ్యాణి, వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి, అడబాల మురళి, ముఖేష్ పాల్గొన్నారు.

### మాంటిస్సోరిలో క్రీడోత్సవాలు

**తణుకు:** మాంటిస్సోరి స్కూలులో 36వ వార్షిక క్రీడోత్సవాలను సోమవారం స్కూలు డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జ్ఞాన మంజురి, హెచ్‌ఎం లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివ పాల్గొన్నారు.

## కులగణన అభ్యంతరాలకు గడవు పెంచాలి: కేవీపీఎస్

భీమవరం అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీల కులగణనలో అభ్యంతరాలు, సవరణలకు తేదీని పొడిగించాలని సోమవారం కేవీపీఎస్ జిల్లా బృందం జిల్లా కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. ఐదు రోజుల్లో సవరణలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులకు అందించండి అని ప్రతినిధి బృందానికి కలెక్టర్ తెలిపారు. ఇంకా అభ్యంతరాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తీసుకోమని అధికారులను ఆదేశించారు. దిగుపాటి రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ, ఎస్టీ కులగణన వివరాలను జిల్లాలో అన్ని సచివాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశాలను జిల్లాలో ఎక్కువ సచివాలయాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు.

## ఎట్టకేలకు మోక్షం



ఆకివీడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎస్బీఐ వద్ద ఏళ్ళ తరబడి ఉన్న మురుగుబోదె సమస్యను ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదేశాలతో సోమవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు పలు ఆక్రమణలు తొలగించి మురుగునీరు సరఫరా అయ్యేలా చేశారు.

## రీ సర్వేలో భూ సమస్యలు పరిష్కరించుకోండి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూ తగాదాలు లేకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం రీ సర్వే పథకం నిర్వహిస్తోందని సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. నవాబుపాలెంలో జిల్లాలోనే ప్రప్రథమంగా ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్న రీ సర్వే ప్రాజెక్టును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కౌసర్ బానో మాట్లాడుతూ సమస్యలేమైనా ఉంటే వాటిని సత్వరం పరిష్కరించేందుకు మొబైల్ టీంలు ఉన్నాయని రైతులు ఈ రీ సర్వేకు సహకరించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు కేంద్ర సహకారంతో ముందుకు వెళ్తున్నారన్నారు. గ్రామానికి చెందిన బాలుడికి బ్రెయిన్ సర్జరీ చేయగా టీడీపీ నాయకుడు మద్దుకూరి ధనరాజు ఆధ్వర్యంలో సేకరించిన రూ.40 వేల విరాళాలను అందిస్తుండగా ఎమ్మెల్యే బొలిశెట్టి మరో రూ.10 వేలు జత చేసి రూ.50వేలు బాలుడి కుటుంబానికి అందించారు.

**అత్తిలి:** అత్తిలిలో రీ సర్వే ప్రారంభించినట్లు అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. గ్రామంలో 7 బృందాలు రీ సర్వే చేస్తాయన్నారు. సర్వే చేసే ముందు రైతులకు సర్వే నంబర్ల వివరాలను రైతులకు తెలియజేస్తారని రైతులు సహకరించాలన్నారు.

**నరసాపురం రూరల్:** మల్లవరంలో 25 రోజుల పాటు భూ రీ సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. ప్రతి రోజు 25 ఎకరాల చొప్పున రెవెన్యూ సిబ్బంది సర్వే చేపడతారన్నారు.

**యలమంచిలి:** భూసమస్యలను పరిష్కరించి పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని తహసీల్దారు జి.పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనుమర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన భూ రీసర్వే అవగాహన కార్యక్రమంలో తహసీల్దారు పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం రైతులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## ఇంటర్వ్యూ..

### ప్రధాన రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాం



త్రినాథరావు, మునిసిపల్ ఇంజనీర్

- **ఏయే రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదించారు?**
  జవాబు: శ్రీరాంపురం, టౌన్ హాల్ రోడ్డు, నర్సయ్య అగ్రహారం రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదించాం.
- **రూ. ఎన్ని కోట్లు ప్రతిపాదించారు?**
  జవాబు: దాదాపు రూ. 5 కోట్ల వరకు ఉంటాయి.
- **అమృత్‌లో నిర్మించిన రిజర్వాయర్లు వినియోగంలోకి వచ్చాయా?**
  జవాబు: 3 రిజర్వాయర్లు నిర్మించాం. నర్సయ్య అగ్రహారం, దుర్గాపురంలో రిజర్వాయర్లు వినియోగంలోకి వచ్చాయి. బీసీ కాలనీలో రిజర్వాయర్ ట్రయల్ రన్‌లో ఉంది.
- **పట్టణంలో బ్యూటిఫికేషన్‌కు ఎంత ఖర్చు చేస్తున్నారు?**
  జవాబు: దాదాపు రూ. 20 లక్షలతో ప్రతిపాదించాం.
- **ఎక్కడ చేయిస్తున్నారు?**
  జవాబు: రైల్వే అండర్ టన్నెల్, యనమదుర్రు బ్రిడ్జి, డివైడర్లు, ఓవర్ బ్రిడ్జిల బ్యూటిఫికేషన్ చేయిస్తున్నాం.
- **పైపులైన్ లీకేజీలు ఉన్నాయా?**
  జవాబు: మైనర్ లీకులు తప్ప మేజర్ లీకులు లేవు. ఎక్కడ వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం.

(ఆంధ్రజ్యోతి-భీమవరం టౌన్)

## శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ధర్నా

తణుకు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇరగవరం కాలనీ వాసులు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సోమవారం రాత్రి రోడ్డుపై టెంట్ వేసి దళితులు బైఠాయించారు. పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను కొమరవరం రోడ్డు వైపు మళ్ళించారు.



## అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

కాళ్ళ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరులోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి ఆకివీడుకు చెందిన మామిడి నాగ అంజనేయరావు- కొండా కనకరత్నం దంపతులు, కుమారులు సోమవారం ఆలయ ఇవో ఎం. అరుణ్ కుమార్‌కు రూ. 1,00,160 విరాళాన్ని అందజేశారు. వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి బాండ్ పత్రాన్ని అందించారు.

## డైరీ ఆవిష్కరణ

కాళ్ళ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం 2025 డైరీ, క్యాలెండర్లను సోమవారం కాళ్ళ ఎంపీడీవో జి.స్వాతి ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది.

## పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి కె విజయకుమార్ కోరారు. పట్టింపాలెంలో మండల స్థాయి పశువైద్య శిబిరాలు సోమవారం సర్పంచ్ బొనిగే పోతన్న ప్రారంభించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గొర్రెలకు నట్టల మందు అందించారు. వైద్య శిబిరాలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా మందులు అందించారు.

## కుష్ఠుపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠుపై అవగాహన అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.వి. వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం పీహెచ్‌సీ పరిధిలో సోమవారం కృష్ణాయపాలెంలో కుష్ఠు సర్వేను సోమవారం పర్యవేక్షించారు. ఆశా కార్యకర్తలు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో విశ్వనాధ్ పర్యవేక్షించారు.

## దివ్యాంగుల్లో ఉత్తేజం నింపుతున్న 'సహిత'

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఉత్తేజాన్ని నింపేలా సహిత క్లబ్ ముందుకు వచ్చిందని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు బాల ఈశ్వరయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని సుబ్బారావుపేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

## బెల్ట్‌షాపుల్ని అరికట్టాలి

నరసాపురం టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్లు అమ్మకాలను దెబ్బతీస్తున్న బెల్ట్ షాపుల్ని అరికట్టి, కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంటి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో జరిగిన గీత కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలన్నారు.